## రేపు అచ్చంపేటకు మంత్రి కేటీఆర్ రాక

- అచ్చంపేట ఎత్తిపోతల పథకం పనులకు శంకుస్థాపన
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

అచ్చంపేట, అక్టోబర్ 8 : అచ్చంపేట ప్రజలు ఎదురుచూస్తున్న అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ మంగళవారం రానున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంత్రి కేటీఆర్ ప్రసంగించనున్న సభా స్థలాన్ని గువ్వల ఆదివారం పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ ఆరోగ్య రీత్యా పర్యటన వాయిదా పడగానే ప్రతిపక్షాలు సంతోషించడం చాలా బాధాకరమన్నారు. ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని, ప్రాజెక్టు పనులు ప్రారంభమైతే తమ పార్టీకి డిపాజిట్ దక్కదని గుబులు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టును అడ్డుకునే కుట్రలు చేస్తే రాజకీయంగా అచ్చంపేట ప్రజలు భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. మంత్రి శంకుస్థాపన చేసే అచ్చంపేట సాగునీటి ప్రాజెక్టును ప్రారంభించుకొని కృష్ణా జలాలతో రైతుల పాదాలను కడుగుతామన్నారు. మంత్రి సభకు రైతులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఎన్నికల కోడ్ వస్తే హంగామా చేయకుండా సభకు రావాలని, కోడ్ రాకుంటే సంబురంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సోషల్‌మీడియాలో తాను ఏడుస్తున్నట్లు ఫొటోలు పెడుతూ ప్రతిపక్షాలు సంతోషపడుతున్నాయని ఎద్దేవా చేశారు. మంత్రి సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచులకు సర్కారు కానుక

- చుక్కాయపల్లిలో బతుకమ్మ చీరల పంపిణీ

కొల్లాపూర్, అక్టోబర్ 8 : రాష్ట్ర మహిళలకు ముఖ్యమంత్రి కేసీఆర్ దసరా కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని పట్టణ 2వ వార్డు (చుక్కాయపల్లి)కౌన్సిలర్‌అనిత వెల్లడించారు. చుక్కాయపల్లిలో మహిళలకు ఆమె ఆదివారం చీరలు పంపిణీ చేసి మాట్లాడారు.అన్ని వర్గాలను సమానంగా గౌరవిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. స్వరాష్ట్రంలో సర్వమతాల పండుగలను ఘనంగా జరుపుకొంటున్నామన్నారు. ముస్లింలకు రంజాన్ కానుకగా దుస్తులు, ఇఫ్తార్ విందు, క్రైస్తవులకు కొత్త దుస్తులతోపాటు విందు, దసరా సందర్భంగా మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



చుక్కాయపల్లిలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అనిత

# కాంగ్రెస్, బీజేపీలతో అభివృద్ధి శూన్యం

- రూ.80లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ
- రేపు ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రాక
- 70వేల మందితో భారీ బహిరంగ సభ



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విప్ గువ్వల

బల్మూరు, అక్టోబర్ 8 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రంలో అన్నివిధాలా అభివృద్ధి జరుగుతున్నదని, బీజేపీ, కాంగ్రెస్‌లతో అభివృద్ధి శూన్యమని అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండలంలోని కొండనాగులలో రూ.80లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గువ్వల భూమిపూజ చేశారు. అందులో రూ.20లక్షలతో జీపీ భవన నిర్మాణం, రూ.20లక్షలతో ఖబ్రాస్తాన్, రూ.20లక్షలతో ముస్లిం మైనార్టీ కమిటీ హాల్ నిర్మాణం, రూ.5లక్షలతో చెన్నకేశవ ఆలయ ప్రహరీ, రూ.5లక్షలతో ఆలయ కమిటీ హాల్ నిర్మాణం, రూ.5లక్షలతో క్రీడ మైదానం, రూ.5లక్షలతో రోడ్డు వెడల్పు పనులను పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10గంటలకు మంత్రి కేటీఆర్ ఉమమాహేశ్వర లిఫ్ట్‌కు భూమిపూజతోపాటు పలు అబివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. దాదాపు 70వేల మందితో బహిరంగసభకు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయలని కోరారు.అనంతరం గ్రామంలోని వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి గులాబీ గూటికి ఆహ్వానించారు. రాన్నున ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని గువ్వల ధీమా వ్యక్తం చేశారు. ప్రారంభించిన పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు.కార్యక్రమంలో ఎంపీ పీ అరుణ, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, కొండనాగుల సర్పంచ్ రేవతి, ఉపసర్పంచ్ యూసుఫ్,నాయకులు గోపాల్‌నాయక్, కరుణాకార్‌రావు, వెంకటయ్య, చంద్రమోహన్, రామస్వామిగౌడ్, సుదర్శన్‌రావు, లింగం, రాజశేఖర్‌రావు, బుచ్చన్న, చందు, సుధకార్, నిరంజన్, కొండల్, రామకృష్ణ, అంజి, సునీల్ తదితరులు ఉన్నారు.

# శ్రీశైలం నిర్వాసితులకు ఊరట

చిన్నంబావి, అక్టోబర్ 8 : శ్రీశైలం ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయి నిర్వా సితులుగా మిగిలిన ప్రతి కుటుంబానికి ఉద్యోగ కల్పన కోసం అహర్నిషలు కృషి చేసి జీవో 98ని క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటించడంపై సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ఎంపీపీ సోమేశ్వరమ్మ కృతజ్ఞతలు తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మండల నాయకులతో కలిసి మాట్లాడారు. మూడు దశాబ్దాల కాలంగా శ్రీశైలం నిర్వాసితుల చిరకాల కోరిక అయిన ఉద్యోగాల కోసం సీఎం కేసీఆర్ 98జీవో క్రమబద్ధీకరిస్తున్నట్లు ప్రకటించడం హర్షణీయమన్నారు. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న కోరిక నెరవేర్చినందుకు కొల్లాపూర్ ప్రజల రుణం తీర్చినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. దశలవారీగా నిర్వాసితులకు ఉద్యోగ కల్పన చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం నిర్వాసితులకు న్యాయం చేసేందుకు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బీరం అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కొల్లాపూర్ ఎమ్మెల్యేగా బీరం హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించుకొని మరింత అభివృద్ధిని సాధించుకుందామని మండల ప్రజలకు వారు సూచించారు. సమావేశంలో సర్పంచులు గోవిందు శ్రీధర్‌రెడ్డి, రామస్వామి, మండల నాయకులు చిన్నారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శివారెడ్డి, ఆనంద్ యాదవ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరమ్మ, మండల నాయకులు

# నాడు నిరసన.. నేడు హర్షం

- నాడు బురద రోడ్డులోవరి నాట్లు వేసి నిరసన
- నేడుసీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామస్తుల హర్షం
- ఎమ్మెల్యే బీరం చొరవతో మెరుస్తున్న కోడేరు మెయిన్‌రోడ్డు, బస్టాండ్ ప్రాంగణం

కోడేరు, అక్టోబర్ 8: సుమారు 20ఏండ్లపాటు ప్రతిఏటా వర్షాకాలంలో బురదమయంగా ఉంటున్న కోడేరు ప్రధాన రహదారితోపాటు బస్టాండ్ ప్రాంగణం నేడు పరిశుభ్రతకు నిలయంగా మారాయి. గతపాలకుల నిర్లక్ష్యం వల్ల ఎలాంటి పురోగతికి నోచుకోకుండా బస్టాండ్ పరిసర ప్రాంతమంతా బురదయమంగా ఉంటున్నది. ఓట్లు వేసి గెలిపించిన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని 2018జూలై 18న కోడేరులోని ప్రధాన రహదారిపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే ప్రధాన రహదారితోపాటు బస్టాండ్ ప్రాంగణమంతా బురదయమంగా మారి ప్రజలు నడవలేని దుస్థితి ఉండేది. దీంతో అప్పట్లో గ్రామస్తులు బురదలో వరినాట్లు వేసి నిరసన తెలిపిన విషయం పాఠకులకు విధితమే. 2019లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై కోడేరుకు వచ్చిన సందర్భంగా స్థానికులు ప్రధాన రోడ్డు బస్టాండ్ దుస్థితిని చూపించారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో బస్టాండ్ సమీపంలోని పరిసరాల్లో మట్టి వేసి బురదలేకుండా చూడాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ఇతర నాయకులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బస్టాండ్ ప్రాంగణంలో డస్టుతో కూడిన చిన్న కంకరను వేశారు. దీంతో నీళ్లు నిల్వ ఉండకుండా బురదలేకుండా పోయింది. దీంతో బస్టాండ్ పరిసరాలన్నీ పరిశుభ్రతకు నిలయంగా మారాయి. అలాగే గతంలోనే నర్సాయపల్లి క్రాస్‌రోడ్డు నుంచి నాగర్‌కర్నూల్ రోడ్డు వరకు బీటీ రహదారితోపాటు కోడేరు మండల కేంద్రంలో 350మీటర్ల పొడవునా 7.2 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆనాడే నిధులు మంజూరైనప్పటికీ సకాలంలో పనులు చేయలేదు. దీంతో వర్షాకాలమంతా ప్రధాన రహదారిపై బురద ఉండేది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. గ్రామస్తుల కోరిక మేరకు 350మీటర్ల పొడవు 7.2మీటర్ల వెడల్పుతో వేసే సీసీ రోడ్డు సరిపోదని రీ ఎస్టిమేషన్ వేయించి అదనంగా రూ.2కోట్ల80లక్షలను మంజూరు చేయించి 45ఫీట్ల వెడల్పుతో 1100 మీటర్ల పొడవునా రెండు వైపులా డ్రైనేజీతో కలిపి సీసీరోడ్డు నిర్మాణం చేయాలని అందుకు అవసరమైన నిధులను కేటాంచారు. ఆ నిధులతో ప్రధాన రహదారిపై సీసీరోడ్డు నిర్మాణం పనులను దాదాపు పూర్తి చేశారు. నాడు నాట్లు వేసి నిరసన తెలిపిన ప్రజలే నేడు రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకనాడు నాట్లు వేసిన ప్రధాన రహదారి, బస్టాండ్ ప్రాంగణం నేడు అద్దంలా మెరుస్తున్నది. అదేవిధంగా కోడేరు మండల కేంద్రంపై ప్రత్యేక దృష్టి పెట్టుకున్న ఎమ్మెల్యే బీరం గతేడాది మార్చిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అంతర్గత రోడ్లను సీసీలుగా మార్చి ప్రజల సౌకర్యాలను మెరుగుపర్చాలని రూ.కోటి10 లక్షలను మంజూరు చేయించి సీసీరోడ్ల నిర్మా ణం పనులను కూడా పూర్తి చేయించారు. దీంతో కోడేరులో అత్యధికంగా సీసీరోడ్లు వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో ప్రధాన రహదారి, బస్టాండ్ పరిసరాల్లో బురదలేకుండా చేసినందుకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నాడు / నేడు



కోడేరులో ప్రధాన రహదారిపై వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు (ఫైల్)



సీసీరోడ్డు పూర్తికావడంతో అద్దంలా మెరుస్తున్న కోడేరు ప్రధాన రహదారి

## మైసమ్మ అడవిలో చిరుత సంచారం

నవాబ్‌పేట, అక్టోబర్ 8 : మండలంలోని ఫతేపూర్ మైసమ్మ అడవిలో చిరుత సంచరిస్తుందనే ప్రచారం జోరుగా కొనసాగుతుండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళ నవాబ్‌పేట మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి ప్రయాణించేవారు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మైసమ్మ అటవీ ప్రాంతం సుదీర్ఘంగా ఉండడంతో కొంత కాలంగా చిరుతలు, పెద్ద పులులు, వివిధ వన్యప్రాణులు అడవిని ఆవాసంగా చేసుకొని జీవనం సాగిస్తున్నాయి. కాగా ఇటీవల తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుకు కూరగాయలు తీసుకెళ్తున్న రైతులకు మైసమ్మ అడవిలో చిరుత దర్శనమిచ్చింది. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం నవాబ్‌పేటకు చెందిన ప్రయాణికుడు తన సొంత పని నిమిత్తం కారులో వెళ్తుండగా.. తన వాహనం ముందు నుంచి చిరుత రోడ్డు దాటుతుండగా తీసిన ఫొటో వైరల్‌గా మారింది. ఇది చూసిన ప్రజలు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

## ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 8 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్-17, 19 రగ్బీ బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ అండర్-14, 19 సెక్రటరీలు రమేశ్‌బాబు, పాపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని ఆకాక్షించారు. క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని, క్రీడల్లో రాణించాలన్నారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు మహబూబాబాద్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీలో జిల్లా జట్లు పాల్గొనున్నాయి. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, ఉమాపతిరెడ్డి, సత్యనారాయణ, నర్సింహారెడ్డి, మొగులాల్, గులాం, పాల్గొన్నారు.



రగ్బీ ఎంపికలకు హాజరైన క్రీడాకారులు